క్లుప్తంగా

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

టేకుమట్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడం మూలంగా చిట్యాల, మొగుళ్లపల్లికి వెళ్లి ఆధార్ పనుల చేపించుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కేంద్రం మండల కేంద్రానికి మంజూరైనా ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయలైన సంఘటన రేగొండ మండలంలోని దమ్మన్నపేట క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల పట్టణానికి చెందిన సావేటి భిక్షపతి వ్యక్తిగత పనుల నిమిత్తం రేపాకకు వెళ్లి పరకాలకు తిరిగి వెళ్తున్న క్రమంలో దమ్మన్నపేట క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనగా తీవ్ర గాయాలపాలయ్యాడు. స్పందించిన స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రుడిని పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సావేటి భిక్షపతి వద్ద రూ.23,260లతో పాటు సెల్‌ఫోన్‌ను అతని భార్య భద్రమ్మకు అందించగా 108 సిబ్బంది టెక్నీషియన్ శంకర్ రావును భద్రమ్మతో పాటు పలువురు అభినందించారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకులు వెలిశెట్టి రాజయ్య పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ శిక్షణ తరగతులకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ హాజరై మాట్లాడారు. ఎర్ర జెండానే పేద ప్రజలకు అండ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ ముందుంటున్నారు. నేడు (శనివారం) కూడా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బందు సాయిలు, సతీష్, శ్రీకాంత్, ప్రీతి, రమేష్, దేవేందర్ పాల్గొన్నారు.

కేసు నమోదు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని ఇసుక క్వారీల వద్ద నిర్వహిస్తున్న వే‌బ్రిడ్జిలపైన జిల్లా తూనికలు, కొలతల అధికారులు దాడులు చేశారు. శుక్రవారం జిల్లా అధికారి శ్రీలత ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి అన్నారం, గంగపూరి, పలుగుల, కుంట్లం గ్రామాల పరిధిలోని ఇసుక క్వారీల వద్ద నిర్వమిస్తున్న వే‌బ్రిడ్జిలపై దాడి చేసి తూకాల్లో తేడాలు ఉండడంతో ఐదు వే‌బ్రిడ్జి కాంటాల నిర్వహకులపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. వే‌బ్రిడ్జిలోని తూకాల్లో తేడాలు ఉన్నా, తమశాఖ నుంచి ధృవీకరణ పత్రాలు లేకున్న జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు!



ద్వారకపేట శివారులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం



ఆరెపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

- నిరుపయోగంగా మైదానాలు
- కేవలం బోర్డులకే పరిమితం

టేకుమట్ల: గత రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లోని క్రీడాకారులకు క్రీడా నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రమే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తూ క్రీడా పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరి కొన్ని గ్రామాల్లో మాత్రం పాఠశాల మైదానంలోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి బోర్డులను పెట్టారు. మైదాన విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో గ్రామంలోని క్రీడా మైదానానికి రూ.1లక్ష నుంచి, రూ.3లక్షల వరకు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేక చిన్నపాటి స్థలంలో కూడా బోర్డులు ఏర్పాటు చేసి క్రీడా ప్రాంగణాలుగా ఏర్పాటు చేశారు.

అలంకార ప్రాయంగా మైదానాలు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి వచ్చిన దాఖలాలు లేవు. చాలా గ్రామాల్లో మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కనీసం ఆటలాడుకునేందుకు నేల చదును చేయకుండానే బోర్డులను ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో గ్రామాల్లోని అన్ని క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగానే మిగిలిపోయాయి. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేదనే కారణంతో పాఠశాల ప్రాంగణంలోనే క్రీడా ప్రాంగణం అనే బోర్డులను ఏర్పాటు చేసి బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్రీడా ప్రాంగణాల్లో ఖోఖో, షటిల్, వాలీ బాల్ కోర్టు, వ్యాయామం బార్లు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు మండలంలోని ఏ గ్రామంలో క్రీడాకారులకు పూర్తి స్థాయిలో అందుబాటులో తెచ్చిన దాఖాలా లు లేవు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా ఎక్క డా వినియోగంలోకి రాకపోవడంతో క్రీడా మైదానా ల కోసం వెచ్చించిన నిధులు నీళ్లపాలు అ య్యాయ ని పలువురు చర్చించుకుంటున్నారు. కనీసం చేసిన ఖర్చులకు సరైన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని క్రీడాకారులు వాపోతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ఉపయోగపడేలా క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిసి ఎంతో ఊహించాం. కానీ క్రీడా ప్రాంగణాలు ఎక్కడా వినియోగంలోకి తేకపోవడంతో నిరుత్సాహంలో ఉన్నాం. కొన్ని చోట్ల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. సరైన సదుపాయాలను కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి.

- తుమ్మల ఐలయ్య, రాష్ట్రస్థాయి క్రీడాకారుడు, టేకుమట్ల

కనీస సౌకర్యాలు లేవు



క్రీడాకారుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు లేవు. పేరుకే క్రీడా ప్రాంగణాలు కానీ వినియోగంలో మాత్రం శూన్యం. పాఠశాలల్లో కాకుండా ప్రత్యేక స్థలంలో ఆట స్థలాలను ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలు అలా లేవు.

- మారెపెల్లి రాణాప్రతాప్, రాష్ట్రస్థాయి క్రీడాకారుడు, వెలిశాల

సమన్వయంతో ముందుకెళ్తేనే అభివృద్ధి

కాటారం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారిగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, చేపడుతున్న కార్యక్రమాల గూర్చి సభలో వివరించారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా జరగడం లేదని లీకేజీల మరమ్మతులు చేపట్టాలని పలువురు ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సమస్యలు నెలకొనకుండా ఉండటంతో పాటు వర్షాకాలం ప్రారంభం అవుతున్న తరుణంలో విద్యుత్ ప్రమాదాల నివారణ తగు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను సూచించారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను ఎంపీటీసీలు సభలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం

ఏటూరునాగారం: ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు గిరిజన విద్యార్థినులకు సీఐ రాజు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కన్నాయిగూడెం మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని ఆలం శ్వేత పంజాబు రాష్ట్రంలో ఎన్ఐటీ జలందర్‌లో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ, బీఈడీలో సీటు వచ్చింది. అలాగే ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని కోడి శశాంక ఎన్ఐటీ పుదుచ్చేరిలో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ సీటు రావడం జరిగింది. అయితే వీరికి ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో చదువును ముందుకు సాగించలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ రాజు వారికి ఆర్థిక సాయం అందజేశారు. ఉన్నత చదువులు చదువుకొని పేదవారికి అండగా ఉండాలని విద్యార్థులను సీఐ కోరారు. సాయం చేసినందుకు ఉపాధ్యాయులు చెంచయ్య, ఏసీఎంఓ రవీందర్ సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

హోంగార్డుకు సన్మానం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీవిరమణ పొందిన నాంపల్లి నారాయణస్వామిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో చిట్యాల సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై అశోక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణస్వామి నిబద్ధతతో విధులు నిర్వర్తించారని, పదవీ విరమణ తర్వాత జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, జిల్లా అధ్యక్షుడు ముత్యాల మొగిలి, ప్రధాన కార్యదర్శి సీతారాంనాయక్, ప్రసాద్, శీను, రమేష్, రవి, వినోద్, కిరణ్, గోపి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పోలీసులు

ఉపాధిహామీ బిల్లుల్లో అక్రమాలపై విచారణ

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో గతంలో జరిగిన ఉపాధిహామీ పథకంలో పలు అక్రమాలు జరిగాయని గ్రామస్తులు ఇటీవల ఎంపీడీఓ జయశ్రీకి ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం డీఆర్‌డీఓ నరేష్ నవాబుపేటకు చేరుకుని బిల్లుల చెల్లింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టారు. గ్రామంలోని కొంత మంది ఫిర్యాదుదారుల నుంచి వాంగ్మూలాన్ని సేకరించారు. గతంలో గ్రామంలో ఉపాధిహామీ పనులకు వెళ్లకుండా భూస్వాములకు, హైదరాబాద్‌లో ఉండే ఐటీ ఉద్యోగులకు ఉపాధిహామీ పథకంలో డబ్బులు చెల్లించారని డీఆర్‌డీఓకు గ్రామస్తులు విన్నవించారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు ఈ నివేదికను కలెక్టర్‌కు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయశ్రీ, ఏపీఓ హలీం, పంచాయతీ కార్యదర్శి సుచరిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పనులపై విచారణ చేస్తున్న డీఆర్‌డీఓ నరేష్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మంగపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వైశాలి అన్నారు. మండలంలోని చేరుపల్లి ఎస్టీ కాలనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 64 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు పాటించాలని, ఆహార నియమాలు, వ్యాయమం గురించి వివరించారు. హైపర్ టెన్షన్, షుగర్ వ్యాధి గ్రస్తులకి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ప్రతి నెల పరీక్షలు చేపించుకోని క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఈ నెల 20న నిర్వహిస్తున్న నులి పురుగుల నివారణ కార్యక్రమంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్లల అందరికి తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. హెచ్ఈఓ అబ్బాస్, ఏఎన్ఎం మమత, ఆశవర్కర్లు చంద్రవాణి, విజయలక్ష్మితో పాటు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైశాలి

భాషా పండిట్ల సంబురాలు

ములుగు: తమ పదోన్నతులకు వ్యతిరేకంగా వేసిన కేసు శుక్రవారం సుప్రీం కోర్టు కొట్టివేయడంతో తెలుగు, హిందీ భాషాపండిట్లు, పీఈటీలు సంబురాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ పాణిని, అధికారులు, సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర జిల్లా ప్రధానకార్యదర్శి జట్టి సుభాష్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుతో దశాబ్దాలుగా బాషాపండితులు చేస్తున్న పోరాటానికి తగిన న్యాయం జరిగిందని అన్నారు. పోరాటానికి మద్దతు ఇచ్చిన అన్ని సంఘాల సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా బాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, పాడ్య రవి, మమత, శ్రీలక్ష్మి, సునీత, సంధ్యారాణి పాల్గొన్నారు.

పంటలు మునగకుండా చూడాలి



గణపురం: అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: రక్తదానం చేస్తున్న యువతను అభినందిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: ప్రతి వర్షాకాలంలో మోరంచవాగు ప్రవాహంతో వేలాది ఎకరాల పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, ముంపు ప్రాంతాల పంటలు నీట మునగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం గణపురం మండలం దుబ్బపల్లి శివారులో మోరంచవాగును కలెక్టర్ భవేష్‌మిశ్రా, జెన్‌కో సీఈ సిద్ధయ్యతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. మోరంచవాగు ఉధృతంగా ప్రవహిస్తే పంట పొలాలు ఎక్కడి వరకు మునుగుతాయి, మోరంచ వాగు ప్రవహంతో పంటలు మునగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చించారు. మోరంచపల్లి గ్రామం కూడా ప్రతి ఏటా నీట మునుగుతుందని ఇక్కడ ఉన్న జామయిల్ తోటను పూర్తి తొలగించాలని, మోరంచవాగు పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

భూపాలపల్లి రూరల్: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలు నిలుస్తాయని, అందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఐటీ మాస్టర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వహకుడు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రక్తదానంపై యువత గ్రామాల్లో ప్రజలకు అవగాహన పెంచి రక్తదానం చేసేందుకు ప్రతీ ఒక్కరినీ ప్రోత్సహించాలని అన్నారు. జిల్లాలో రక్తం కొరత లేకుండా చూడాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

మొగుళ్లపల్లి: రాష్ట్రంలో వెంటనే కులగణన కోసం చర్యలు చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున ఇంటింటి సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించాలన్నారు. కులగణన నిర్వహించి జనాభా ఆధారంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాగా, అధికారంలోకి రాగానే రాష్ట్ర క్యాబినెట్ అసెంబ్లీలో తీర్మానం చేసి, కులగణనను మొదలు పెట్టడానికి జీఓ నెంబర్ 26ను తీసుకొచ్చి, కులగణన నిర్వహణకు 150 కోట్ల బడ్జెట్ ను కూడా విడుదల చేసిందని గుర్తు చేశారు. వెంటనే సర్వే నిర్వహించి కులాల జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేయాలని కోరారు. కులగణన నిర్వహించి బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే గ్రామపంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

దేవస్థాన భూములను రక్షించాలి



రాస్తారోకో చేస్తున్న బెస్తగూడెం గ్రామస్తులు

వెంకటాపురం(కె): ఇష్టపూరి దేవస్థానానికి చెందిన భూములను రక్షించాలని కోరుతూ శుక్రవారం బెస్తగూడెం గ్రామస్తులు మండల కేంద్రంలోని శివాలయం గుడి సెంటర్‌లో గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. బెస్తగూడెం గ్రామ సమీపంలోని ఇష్టపూరి వినాయకుడి గుడి సమీపంలో గుడి నిర్వహణ కోసం భూమిని కేటాయించినట్లు తెలిపారు. కాగా, అట్టి భూమిపై ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి గిరిజనులు అక్రమించుకునేందకు కుట్రలు చేస్తూ ఆందోళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థాన భూమిని అక్రమించుకోవటంతో దేవుడి దూప దీప నైవేద్యాల ఖర్చులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైన అధికారులు దేవస్థాన భూమిని దేవాలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకోని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బొడ్రాయిని ప్రతిష్ఠించి 12 సంవత్సరాలు కావడంతో శుక్రవారం వార్షికోత్సవ పూజలను పండితుడు యల్లాప్రగఢ రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. బొడ్రాయికి ఉదయం భక్తులు పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాలను సమర్పించి ప్రత్యేక అర్చనలు చేశారు. భక్తులతో బొడ్రాయి ప్రాంతం రద్దీగా మారింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శనిగల ప్రసాదాన్ని, నూతన వస్త్రాలను పోగుల లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ దంపతులు అందజేశారు. కత్తెర శ్రీనివాస్, జూపాక రాజేష్, జయంత్, కుమార్, రమేష్, మహేందర్, శివ, సతీష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మల్హర్: పుస్తకాలు అందిస్తున్న జెడ్పీటీసీ కోమల




మొగుళ్లపల్లి: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని జెడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యా పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో డబ్బులు దండుకోవడం తప్ప నాణ్యమైన విద్య లభించదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శనిగారం శ్రీకళ, ప్రధానోపాధ్యాయులు సుదర్శనం, కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి ఆధ్వర్యంలో పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులతో, ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సదానందం, నరసింహస్వామి, సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, రవీందర్, శ్రీధర్ స్వామి, మధుసూదన్, రాజయ్య, సీఆర్‌పీలు వసంత, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు

మహాముత్తారం: మావోయిస్టులు ఎవరైనా గూడెంలోకి వస్తే వారికి సహకరించొద్దని ఎస్సై మహేందర్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని దండేపల్లి గొత్తికోయల గుంపులో శుక్రవారం ఎస్సై కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. మావోయిస్టుల అగ్రనాయకుల ఫ్లెక్సీని ఏర్పాటు చేసి వారిలో ఎవరైనా గూడెంలోకి వస్తే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పోలీసులు